# పందెం




**ఉదయం** పదింటికి పందెం ప్రారంభమైంది.

**విశాలమైన** ఆ ఆట మైదానంలో సుమారు ఐదుగజాల వ్యాసంతో తయారు చేసిన వృత్తం చుట్టూ యినపతీగ కట్టారు మధ్య రెండు టేబుళ్లు, వాటి మీద గ్రామఫోను, రికార్డులపెట్టె, మైక్, ఓ గొడుగు. గొడుగు కర్రకు ఆన్చి పందెగాడి ఫోటో ఒక వైపున, మరో వైపు బోర్డు మీ

"ఎల్. జాకబ్ బాబు

144 గంటల సైక్లింగ్"

అని రాసి పెట్టారు.

* * *

మధ్యాహ్నం ఎండ బాగా కొట్టింది. జాకబ్ బాబు కొంచెం నిమ్మరసం తాగాడు. ప్రేక్షకులు ఎక్కువగా లేరు. తలలు మాడ్చేస్తున్న ఆ మే నెల ఎండకు భయపడి పెద్దవాళ్లెవరూ అటువైపు రాలేదు కాని పిల్లలు మాత్రం తీగ చుట్టూ తిరుగుతూ అల్లరి చేస్తున్నారు. కొంచెం దూరంలో జారుడు బండమీద ఆడుకుంటున్న పిల్లలు వీళ్ళను పిలుస్తున్నారు. ఐస్ ఫ్రూట్ల బండీ, షర్బతులమ్మేబండీ ఒకటే అక్కడ వున్నాయి. అంతవరదాకా వున్న వేరుశనక్కాయలు, బఠానీల మనిషి వెళ్ళిపొయ్యాడు. దూరంగా వున్న పబ్లికు కుళాయ వద్దకు ఎవరెవరో వచ్చి పోతూనే వున్నారు. రోడ్డు మీద జనం రద్దీగానే వున్నారు. కాని ఎవరికీ యిదేమిటో చూడాలని కుతూహలంగా లేదు కాబోలు. గ్రామఫోను మరింత బిగ్గరగా మోగించారు. జాకబ్ బాబు చెమటకు తడిసిన

షర్టు విప్పి మరొకటి వేసుకున్నాడు. అం నేర్పుగా షర్టు మార్చుకో గలిగినందు పిల్లలు చప్పట్లు కొట్టారు.

కొంచెం గుంపు జమైంది.

ఒకడు చేతిలో గల్లాపెట్టె పట్టుక ప్రేక్షకుల్లోకి వచ్చాడు.

"మీ మిత్రునికి సహాయం చెయ్యం తోచిందేదో గల్లాలో వెయ్యండి" అంట ఒక రౌండు తిరిగాడు డబ్బు లేమీ ప లేదు.

"గల్లాలో వెయ్యటానికి ఇష్టం ల వాళ్లు డబ్బులు నేల మీద వెయ్యం జాకబ్‌బాబు నేర్పు చూడండి." అంట మైక్‌లో ప్రకటించారు. కొంచెంసేపట్లో డబ్బుతో మెరిసింది. రౌండుకు రెం నాణాల చొప్పున వంగి చేత్తో అం కున్నాడు జాకబ్‌బాబు.

ఒకతను నేలమీద రూపాయ నో పెట్టాడు. సైక్లిస్టు అతి నేర్పుగా వం రెండు చేతులూ వెనక్కు కట్టుకు నోటితో నోటును అందుకున్నాడు.

ఆశ్చర్యంతో ప్రేక్షకులు చప్ప కొట్టారు. జాకబ్‌బాబు నమస్కా చాడు.

"డబ్బు కక్కుర్తితో ఇలా ఫీ చేస్తే తొందరగా అలసిపోతాడు. ఎక్కు రోజులు తొక్కలేడు". అన్నారు.

నద్దుమణిగింది.

జాకబ్‌బాబు నెమ్మదిగా సైకి తొక్కుతున్నాడు. ఒళ్లంతా చెమ పట్టింది. తడి తువ్వాలుతో తుడుచుకుని తల దువ్వుకున్నాడు, టీ తాగాడు. తనన వుల్లాసపరచటానికి మరొకతను హా తొక్కుతూ నవ్విస్తున్నాడు. మధ హ్నామైన్నా ఎండ లేదు. నేల మీద సీ చల్లారు. డబ్బు లేరుకునే గొడవలో ప తను సాయింత్రం మవటమే గ్రహించ లేదు. మంచి మంచి రికార్డు లేస్తున్నారు లైట్లు వెలిగాయి, లైట్ల చుట్టూ పురుగుల మూగుతున్నాయి. మూగిన గుంపుల వెనకనించి సోడాబుడ్లు తెరిచిన చప్పుళ్లూ హారన్లూ, తినుబండారాల బళ్ల వాళ్ల కేకలు వినిపిస్తున్నాయి. ఒక వేపు కొద్దిగా ఖాళీచేసి "ఇది ఆడవాళ్లకు ప్రత్యేకం." అన్నారు.

తీగ చుట్టూ జనం రద్దీ తగ్గింది. అమ్ముకునేవాళ్ల గోలలేదు. పిల్లల అల్లరి లేదు. కరెంటు ఎక్కువగా ఖర్చవుతున్నదని మైకు తీసేశారు. టేబుల్ల దగ్గర జనం పేకాడు కుంటున్నారు. జాకబ్‌బాబు నెమ్మదిగా షర్టూ, బనియనూ విప్పేశాడు. ఉక్క యింకా తగ్గనట్టుగా తోచింది. పాంటుకూడా విప్పేసి, అండర్‌వేరు మాత్రం వుంచుకున్నాడు. క్లబ్బులోంచి ఒకతను ఓ బకెట్ నీళ్ళుతెచ్చాడు. జాకబ్ బాబు ఒళ్ళంతా కడుక్కుని మరో గ్లాసుడు నిమ్మరసం తాగేడు, చల్లటి గాలి ఒంటని కితకితలు పెట్టింది. కర్చీ వేసుకుని సిగరెట్ వెలిగించాడు. పక్కనే వున్న తన స్నేహితునితో కబుర్లు చెబుతూ నెమ్మదిగా తిరుగుతున్నాడు.

"కలక్షన్ యాభై రూపాయలొచ్చింది." అన్నాడు మిత్రుడు. తను ఇంకా ఎక్కువ వచ్చిం దనుకున్నాడు. కాని ఎట్లాగయితేనేం, సగం రోజు గడిచింది. ఆనందంలో చేతులు పైకి లేప, నడుం హాండిల్ మీద ఆన్చి కాసేపు కూనిరాగం తీస్తూ తొక్కాడు. నల్లగా వున్న ఆకాశంలో ఒకటి రెండు చుక్కలు కనిపించాయి. దూరంగా చెట్లు, ఉండీ ఉడిగీ పోతున్న వాహనాల హారన్లు, రోడ్డుకు అటుపక్క, లైటు లేని సైకిళ్ళను పట్టుకుంటున్న పోలీసు - పక్కనే వున్న ఆడపిల్లల బడిలోని పిల్లలు మధ్యాహ్నం వచ్చి ఎల్లా అల్లరిచేశారో జ్ఞాపకంవచ్చింది. చౌరస్తామీద ఎర్రలైటు. పక్కనే బ్రిడ్జి-బ్రిడ్జిమీద వరుసగా గుండ్రటి దీపాలు— మరికొంచెం దూరంలో చెట్ల సందులోంచి కనిపించే రైలూ మైదానంలో. మూలగా జారుబండలూ, హారిజాంటల్ బార్స్.

అర్ధరాత్రి తరువాత ఎవరూ లేరక్కడ నిద్రపట్టక రోడ్లవెంట షికారెళ్ళిన వాళ్లు ఎవరోవచ్చి ఒకసారి చూసి వెళ్ళారు. సైకిలు నెమ్మదిగా తొక్కుతూనే వున్నాడు పందెగాడు. మైదానంలో దూరంగా, యిళ్లలోని వుక్కను భరించలేక వచ్చి పడుకున్న వాళ్ళు అగుపిస్తున్నారు. జాకబు బాబుకు ఒంటరిగా తోచి నిద్రవస్తుందేమోనని గ్రామఫోను మళ్ళీ ప్రారంభించాడు. ప్రతి గంటకూ టీ తాగేరు. అప్పుడప్పుడు మైదానం వైపుకు తెరుచుకున్నాయి ఎదురుగా వున్న మేడ కిటికీలు. టేబుళ్ళదగ్గర కూర్చున్న వాళ్ళు ఆ కిటికీల వెనక జీవితాన్ని వూహించుకున్నారు. అతి త్వరగా అది వ్యభిచారాన్ని గురించిన చర్చగా మారించి, తరువాత వరుసగా, పోటీగా అందరూ తమతమ అనుభవాలనూ, విజ్ఞానాన్ని ఏకరువుపెట్టి, జాకబుబాబును కూడా అందులోకి లాగి వుత్సాహపరిచారు.

అంత వరదాకా కూచున్నవాళ్ళు వెళ్ళి మరొక షిఫ్టువాళ్లు వచ్చారు. జాకబ్‌బాగా వాళ్ళకు టాపిక్ చెప్పాడు. మళ్లీ కథలు ప్రారంభమై, చాల వుద్రేక పూరితంగా సాగాయి. వస్తున్న నిద్రను ఆపుకోవటానికి జాకబ్ తన అనుభవం ఒకటి చెప్పసాగాడు. కాని నిద్రఆగలేదు, టీత్రాగాడు. ఒకసారి తూలి పడబోయాడు. కూర్చున్న వాళ్లు వచ్చి అతణ్ణి ఆపి పట్టుకున్నారు. కాని అప్పుడే అలసట ప్రవేశించినట్టుగా తోచింది. కాళ్ళు పీకుతున్నాయి. అందరూ తలా ఓ సైకిల్ తొక్కుతూ అతణ్ణికాసేపు నవ్వించినా, ఉషోదయాన వీచే చల్లనిగాలి పునరుత్సాహ పరచినా, జాకబ్‌బాబు పూర్తిగా తేరుకోలేకపోయాడు.

"కళ్ళు మూసుకుపోతున్నాయి." అని కేకేశాడు.

ఒకతను నోట్లో వేసుకొమ్మని చాక్లెట్

యిచ్చాడు.

మరోకతను నిమ్మబద్దతెచ్చి కండ్ల

పిండాడు.

చిమ చిమమని కళ్ళు మండినై.

వేడిసీళ్ళు కారిం తర్వాత నిద్రభారం

కొంచెం తగ్గింది.

పడుకున్న వాళ్లు ఆవలించారు. ఎర్రగ మారింది ఆకాశం. మరింత చల్లగా జోరుగా వీచింది గాలి. కొత్త శక్తి నింపినట్లుగా తోచింది జాకబుకు. పక్కల చట్టుకుని లేచి వెళ్ళిపోయారు మనుషుల తీగచుట్టూ మళ్లీ పిల్లలు మూగుతున్నారు


సూర్యోదయం ఏమీ బావుండలేదు రాత్రంతా బాగా చీకటికీ. ఒంటరితనాని అలవాటుపడ్డ కళ్లు వెలుగును చూడలే పోయాయి. చుట్టూ మూగుతున్న జన కేసి చూడాలనే వుత్సాహంలేదు. ఏవేవ రికార్డులు వేస్తున్నారు. అన్నీ పాతవే ఇంకా యిరవై నాలుగ్గంటలన్నా కా దున్న సంగతి జ్ఞాపకం వచ్చింది బాధగ తమ కోరికే తోడుగా మరొకరు తొక్కుత హాస్యం చేస్తారు. కబుర్లు చెబుతార ప్రేక్షకులచేత చప్పట్లు కొట్టిస్తారు. ఇ మొదటి పందెమేం కాదు. సాధారణం యిట్లాగే వుంటుంది పరిస్థితి. కాని ఈస ఏమిటో దిగులుగా వుంది.

'బిస్కట్లు కావాలి'న్నాడు.

వాళ్లు తెచ్చిచ్చారు.

తను కొన్నితిని మిగిలినవి విసిరేశాం పిల్లలు ఎగబడ్డారు. గోలచేశారు.

కాని యిదంతా లాభంలేదు. యెం పేపు యిట్లా చెయ్యలేదు. ఇంతలో పక నించి ఏయ్ మనిషివా, గాడిదవా! అ రెవరో. అటు చూస్తే ఓ పదేళ్ళపిల్ల పించింది. ఆ పిల్లను తోసుకొని మ పిల్లాడు ముందుకొచ్చి నిలబడ్డాడు. ఇం ఎదిగీ ఎదగని ఆ పిల్ల ఒళ్లు-తలిసో యతో చేసిన ఆ పిల్లాడి చేష్టలు-ఎక్క లేని కోపంతో ఆ పిల్ల అన్నమాటల్ల




స్త్రీత్వం - చాలా సుఖంగా కాలం గడప టానికి అనువైన మనోస్థితిలోకిగెంతాడు. ఆమె సిగ్గు అతనికి అనేక అనుభవాలను వరుసగా జ్ఞాపకం తెచ్చింది....

* * *

అకస్మాతుగా మొదలైన గొడవచూసి వులిక్కిపడ్డాడు జాకబు బాబు. ఏమైనా ప్రమాదం జరిగిందేమోనని....చప్పట్లు. మైకు....తీరాచూస్తే పదిగంటలు కొట్టారు ఇరవై నాలుగు గంటలు గడిచాయి. క్లబ్బు సెక్రటరీ వచ్చి కరచాలనం చేశాడు.

"మీరు యిదే విధంగా పందెం విజయ వంతం చెయ్యాలని కోరుకున్నాను" అన్నాడు.

అందరూ టీ తాగేరు సంతోషంగా.

ఈ ఏర్పాట్లన్నీ చూస్తున్న మోసెస్ వచ్చి బాతాఖానీ వేశాడు.

"ఏరా, ఎల్లావుంది? ఇదివరకులా టలా సాగా లేవేం? ఒంట్లో బావుండలేదా? మాట్లాడటంకూడా లేదు. అలా మూగగా తొక్కుతున్నావేం?—అదిగో డబ్బులు పడుతున్నాయి ఏరుకో." అంటూ పక్కకు తప్పుకున్నాడు.

మధ్యాహ్నం జనం బాగా వచ్చారు. కాని సైక్లిస్టుకి ఓ రకమైన అపస్మారకం నెమ్మదిగా కమ్ముకుంది. జనంకొట్టేచప్పట్లు వేశే ఈలలు అతణ్ని ఉత్సాహపరచ లేక పోయాయి. నిర్విరామంగా మెదడు పని చేయటం వల్లనేమో యిప్పుడేమీ ఆలో చించలేక పోతున్నాడు. జనం క్రితంరోజు కన్నా ఎక్కువ వచ్చారు. మరో ఐదు రోజులదాకా సాగబోతున్నది గనుక ఓ చిన్న గుడారం వేసుకుని యిడ్లీలుతయారు చేస్తున్నాడు ఒకతను.

సాయంత్రం జాకబుబాబు ఫీట్లు ఏమీ చెయ్యలేకపోయినా జనం మాత్రం మూగు తూనే ఉన్నారు. సినిమాహాల్లో టిక్కట్లు దొరక్క గృహోన్ముఖులైన ప్రేక్షకులు అక్కడ కొంతసేపు ఆగేరు. జనం క్రిక్కి రిసి పోవటంతో గుంపు గుంపును ఆక ర్షించింది. ఈ జనాన్ని చూసి మోసెస్ ఓ పూలదండ తెచ్చి జాకబు బాబు మెడలో వేశాడు.

"ఇది మన చైర్మన్‌గారుపంపినదండ. అని చెప్పారు మైకులో.

జనం హుళ్ళీ చప్పట్లు కొట్టారు. తీగ లోపలి మనుషులకు వెచ్చగా వుంది గాలి.

మరికొంచెం సేపటికి ఆకాశంలో మేఘాలు కమ్ముకున్నాయి. ప్రేక్షకులు చాలామంది వెళ్ళిపోయారు. ఆడవాళ్ళ కోసం కేటాయించిన స్థలం ఖాళీగా ఉంది. క్లబ్బు మనుష్యులు వరండాలోకొచ్చి నిలుచున్నారు. సన్నగా చినుకులు మొదలవటంతో మిగతా జనం కూడా వెళ్ళిపోయారు, రికార్డులు వాళ్ళకే విసుగెత్తి ఆపేశారు. జాకబుబాబు రెయిన్‌కోటు వేసుకోలేదు. చల్లగా చినుకులు పడటం సరదాగా ఉంది. సన్నటిముసురు క్రమంగా వర్షంగా మారింది, సైక్లిస్టుకుకోటు అందించారు. అందరూ వరండాలోకి వచ్చికూర్చున్నారు.

ఏవో ఆలోచనల్లో మునిగినట్లుగా తలొంచుకుని చాలా నెమ్మదిగా తొక్కుతున్నాడు సైకిలు. ముఖం మీది చినుకులు కూడా తుడుచుకోవటం లేదు. ఒక[illegible] పరిగా హాండిలుమీద పడేట్టుగా టవెల్ [illegible]సి రాడు.

జాకబ్‌బాబు తల పైకెత్తాడు. వరండాలో వాళ్ళు నవ్వారు.

"ఏమిటిరా ఏం కథ? ఏమాలోచిస్తున్నావు?" అంటూ.

జాకబుబాబు జవాబు చెప్పలేదు.

కాసేపటికి రికార్డులు వెయ్యండోయ్. అంటూ కేకేశాడు, వరండాలో మనుషులు చేతులు జాపి వర్షం చూస్తున్నారు.

"వర్షంవెలిసి చాలాసేపైంది"అన్నాడు జాకబుబాబు.

రికార్డులు ప్రారంభమైనాయి.

"అప్పుడే పదైంది." అన్నాడు సింగు.

"పదేనా?" అన్నాడు జాకబు.

అందరూ ఫక్కున నవ్వారు.

"ఎక్కడా ఒక్క పురుగుకూడా లేదు" అన్నాడు మోసెస్,

"వెచ్చగా పడుకునిఉంటారు"అన్నాడు సింగు ఆవలిస్తూ.

వానకురిసి వెలసిన మట్టివాసన మత్తుగా వ్యాపించింది మైదానంలో. పక్కనకుళ్ళాయి లోంచి వూరికే కారిపోతున్న నీళ్ళచప్పుడు వినిపిస్తోంది, చలిగా వుండటం వల్ల పక్క హోటల్ నుంచి మిరపకాయ బజ్జీలు, టీ తెప్పించారు.

సింగుకథలుచెప్పటం ప్రారంభించాడు. తన అనుభవాలంటూ మిగతావాళ్ళుకూడా వీలైనప్పుడల్లా తమ అనుభవాలను చెప్పి పరస్పరం అభినందించుకున్నారు.

బ్రిడ్జి అవతల పోలీస్ స్టేషన్‌లో గడియారం పన్నెండు గంటలు కొట్టింది.

గూడుకట్టినట్లుగా నల్లటిమబ్బులు మళ్ళీ కమ్ముకున్నాయి. ఏ క్షణంలోనైనా వర్షం కురుస్తుందేమోనన్నట్లుగా ఉంది.

ఆ నల్లటికప్పులోంచి చంద్రుడుసన్నగా కనిపిస్తున్నాడు; గాలి వీయటం లేదు. బాగా వుక్క-ఏదో పెట్టిలో పెట్టి తాళం వేసినట్టుగా. సగం నిద్రపోతూ కాసేపు తొక్కి-మళ్లీ మేలుకున్నాడు రిక్షాల చప్పుడుకు. రెండో ఆట వదిలినట్టుంది. సింగూ, వాళ్లూ అప్పటిదాకా వాగి, వాగి సొమ్మసిలి పడుకున్నారు. ఒకే లైటు వెలుగుతోంది గ్రామఫోను ఎప్పుడో కట్టేశారు.

మరీ ఒంటరిగా వుంది. కాని ఆ ఒంటరి నిశ్శబ్దంలో, స్వేచ్ఛాకాశం కింద తొక్కటం గొప్పగా ఉంది. ఎవరో ఒకరిద్దరు మనుషులు ఇళ్ళల్లోంచి వచ్చి దూరంగా ఉన్న గోడలవద్ద మూత్రంచేసి వెళ్ళారు. పగటి జనసమ్మర్ధం ఒత్తిడికి టెన్షన్ కోల్పోయిన తీగను, తెల్లారితే గుంపుతో నిండిపోయే ఆ మైదానాన్ని ఆప్యాయంగా చూశాడు జాకబ్. కడుపులో మిరపకాయలు నులిపెడుతున్నాయి. ఆవలించాడు.

తలెత్తి చూస్తే - తనవైపు నడిచి వస్తున్నదో ఆకారం. 'ఎవరో బిచ్చగాళ్లు' అనుకున్నాడు. జుట్టు బాగా పెరిగినట్టుంది. కప్పుకున్నట్లుగా ఒంటిమీద గుడ్డలు. ఆకారం ముందుకు కదలలేదు.

ఉండబట్టలేక జాకబు దగ్గరకు రమ్మని సైగచేశాడు. ఆకారం దగ్గరగా కదిలింది. పొట్టిగా సన్నగా వున్న శరీరంతో. తీగ దాకా వచ్చి నిలబడింది, రాంలాల్ సింగును లేపటం చూసి ఉలిక్కి పడ్డాడు జాకబ్ బాబు. ఇద్దరూ కలిపి అటువైపు చూస్తున్నారు. తనూ ఈసారి పరిశీలించి చూసి ఆశ్చర్యపోయాడు.

రొమ్ములే కనిపించలేదు మొదట. స్పష్టంగా చూస్తే అవి కొంచెం వేలాడుతున్నాయి. జాకబ్ ఒంట్లో విద్యుత్తు ప్రవహించింది.

మోసెస్, సింగూ. రాంలాల్ కళ్ళు నులుముకుంటున్నారింకా.

జాకబ్‌బాబు హాండిల్ గట్టిగా పట్టుకున్నాడు. సైకిల్‌మీద కాలు జారిపోకుండా జాగ్రత్త పడ్డాడు.

అది కదల్లేదు. తీగకు శరీరాన్ని ఒత్తుకుంటూ వాళ్ళవైపు చూస్తూ నిలుచుంది, రెండు చేతులూ వెనక్కు తీసుకొని జుత్తు ముడి వేసుకోబోయి మానేసింది. మొహం కోలగా నల్లగా మురికిగా వుంది, కళ్ళ కొలుకుల్లో పుసులు పచ్చగా మెరుస్తున్నాయి చేతులమీద సగంచిరిగిన బొత్తాములు లేని రవిక కింద ముడేసింది. జుత్తుకు బాగా నూనె పట్టించింది కాని దువ్వుకోక పోవడం వల్ల పిచ్చిగా పడి ఉన్నాయి. చీరకూ, రవికకూ మధ్యనున్న వొంటిమీద ఓ ఎర్రటి గుడ్డ చుట్టింది. ఇప్పుడు దాన్ని విప్పి తలపైన ముసుగ్గా వేసింది. నల్లటి ఆ నడుం నూనె మరకలతో మెరిసింది.

"ఆకలి" అంటూ పొట్ట చూపింది.

"ఊహూ?" అంటూదగ్గరకు వెళ్ళాడు సింగు.

అది వెనక్కు తగ్గలేదు. కొంచెం జాలిగా, కొంచెం నవ్వుతూ "నిన్నటి నించీ తిండిలేదు." అంది.

"రా, తిండి పెనతాం." అంటూ తీగ లోపలికి లాగాడు సింగు,

"ఒరేయ్, సింగూ ఇదేం వ్యాపారంరా యిక్కడ. ఒద్దు" అన్నాడు జాకబ్.

"నోరు మూసుకుని సైకిల్ తొక్కు వోయ్" అన్నాడు మోసెస్.

ఇప్పటికి రాంలాల్ మత్తు పూర్తిగా వదిలింది. టేబుళ్ళమీది సామానంతా తీసి కిందపెట్టారు.

జాకబ్‌బాబు టేబుల్‌కు దగ్గరగా చిన్న చిన్న సర్కిల్సు తిరుగుతున్నాడు. కాని సింగు భయంతో మరేం మాట్లాడలేదు. తన రెండురోజుల నిద్రలేమి క్షణంలో ఎగిరిపోయింది.

చివరికి ఆకాశం ఎర్రనైంది.

మళ్లీ మెల్లిగా ఒకటీ, రెండూ బళ్లు సాగుతున్నాయి.

జాకబుబాబు యిప్పుడుతొక్కుతున్నాడు కాని తల భారంగా వుంది. సత్తువ కోల్పోయినట్లుగా సైకిల్ను బాలన్సు చెయ్యటం కష్టమైపోతున్నది, కళ్ళు మండుతూ, నొప్పి పెడుతున్నాయి. బలవంతంగా మూసుకుపోతున్నాయి.

తెల్లారగానే జాకబు తండ్రీ, కొందరు స్నేహితులు, ఓ క్లబ్బు మెంబరూవచ్చారు. రాత్రి షిఫ్టులో ఉన్న రాంలాల్. సింగూ మోసెస్ వెళ్ళిపోయారు.

"ఏమిటి జాకబు, అలా ఉన్నావేం" అన్నాడు తండ్రి.

తనకేం తెలియదన్నట్టుగా తలూపాడు జాకబ్.

"చేతకావటం లేదు" అన్నాడు.

మళ్లీ జనం ప్రవహిస్తున్నారు.జనంతో పాటే అమ్ముకునేవాళ్ళూ కేకలేస్తూవచ్చారు. ఓ బకెట్ నీళ్ళు, వస్తే స్నానం చేశాడు. చలువబట్టలు వేసుకున్నాడు, చక్కగా తల దువ్వుకున్నాడు.

పరామర్శించటానికి మళ్లీ సింగు వాళ్లూ వచ్చారు. డాక్టరు వచ్చి చూసి పరిస్థితి బాగానే వుందని, గ్లూకోజు ఎక్కువగా తీసుకొమ్మనీ చెప్పి వెళ్ళాడు అందువల్ల చాలా ఆతృతతో జాకబ్ గ్లాసులకొద్దీ పాలూ, గ్లూకోజ్ ఖాళీ చేశాడు. సత్తువ వచ్చిందనిపించింది. వెంటనే కింద ఉన్న ఓ రూపాయిని అందుకోవటానికి ప్రయత్నించాడు. ఇంచు మించు పడిపోయేవాడే, కాని రాంలాల్ గబుక్కున వచ్చి రక్షించాడు. దీంతో జాకబ్‌లో మరింత భయం మొదలైంది.

వచ్చిన జనాన్ని చూసి బెదురైంది.అది మూడోరోజవటంవల్ల జనం క్రిక్కిరిసిపోయారు. మళ్ళీ మళ్ళీ మైకులో ప్రకటనలు, చప్పట్లు. ఈలలు. పూలదండలు నవ్వులు. డబ్బు—అన్నీ కురుస్తున్నాయి. కాని జాకబుకు వాటిని భరించటం కష్టంగా వుంది. అవన్నీ తనమీదవున్న దుస్సాధ్యమైన బాధ్యతను గుర్తుచేస్తున్నాయి.

సింగువచ్చి,

"ఏమిరా, వెధవా ఎలావుంది?" అన్నాడు,

"కళ్ళు మూసుకు పోతున్నాయి." అన్నాడు జాకబ్ నీరసంగా

"ఏమిటంత మూగనోము?" అంటూ సింగు ఓ నిమ్మబద్ద తెచ్చిచ్చాడు నోట్లో వేసుకొమ్మని.

జాకబ్ మూలిగాడు.

"ఇవ్వాళ భరించలేను . సింగూ" అన్నాడు.

"ఏం?"

"బహుశా యిక తొక్కలేనేమో" అంటుంటే అతడి కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

"బిగ్గరగా మాట్లాడకు వాళ్ళంతావినేరు" అని సింగు ఆనాటి దినపత్రిక తెచ్చి చూపించాడు. తనబొమ్మ పత్రికలోపడటం బాగుంది కాని,

"లాభం లేదు సింగూ" అన్నాడు జాకబు.

కొత్త కొత్త సినిమా రికార్డులు వేస్తున్నారు.

"మన కౌన్సిలరుగారు ఇవ్వాళ నిన్ను చూడటానికి వస్తాడట" అన్నాడు రాంలాల్ జాకబుతో.

జాకబ్ నిశ్శబ్దం అందర్నీ దిగ్భ్రాంతుల్ని చేసింది. ఒక్క రాత్రిలో యిలా ఎందుకు మారిపోయాడో ఎవరికీ అర్థం కాలేదు.

మళ్లీ తూలేడు.

సింగుకు గుండె ఆగినంత పనైంది, కోపంవచ్చింది.

"ఏమిటి?" అన్నాడు దగ్గరకు వచ్చి కసిగా.

జాకబ్ మౌనంగా తొక్కాడు.

తండ్రి మరో గ్లాసుడు గ్లూకోజు తెచ్చాడు.

ప్రేక్షకుల్లో ఏదో అనుమానం మొదలైంది

ఇంతలో—పదిగొట్టారు. జనం పది నిమిషాలు వరుసగా చప్పట్లుకొట్టారు.

జాకబ్ రెండు రోజులు ముగించి, మూడోరోజులో ప్రవేశించాడని మైకులో చెప్పారు. ఈ పందెం ముగిస్తే ఒకస్థానిక వర్తకుడు బంగారు పతకం యివ్వటానికి అంగీకరించాడని కూడా ప్రకటించారు. కౌన్సిలరుగారితో పాటు, మరి కొంతమంది పురప్రముఖులు కూడా వస్తారని ప్రత్యేక ఏర్పాట్లుకూడా ప్రారంభించారు.

క్షణ క్షణానికి ఎక్కువయ్యే జనాన్ని కంట్రోలు చెయ్యటం కష్టమైంది. ఇట్లాంటి పందాన్ని ఇంత చిన్న మైదానంలో ఏర్పాటుచేసిన నిర్వాహకుల మీద విసుక్కున్నారు చాలామంది.

జాకబ్ స్నేహితులం, ఆ స్నేహితుల స్నేహితులం అంటూ తీగ లోపల కూడా

చాలామంది జమైనారు.

జాకబ్ మళ్లీ తూలాడు.

తండ్రీ, మోసెస్ వచ్చి పట్టుకున్నారు.

"నేను దిగుతాను నాన్నా" అన్నాడు జాకబ్.

"ఏమిటీ!" అంటూ కసురుకున్నాడు తండ్రి.

సింగూ, రాంలాల్ కూడా కోపం తెచ్చుకున్నారీ మాటలకు.

"నువ్వు దిగవు. దిగటానికి వీల్లేదు. మరో నాలుగురోజులు యిలాగే తొక్కుతావు" అన్నాడు సింగు.

ఐదునిమిషాల తర్వాత పొగలు కక్కే స్ట్రాంగు టీ డికాక్షన్ తెచ్చి తాగించాడు జాకబుచేత. ఐనా కొంచెంసేపట్లో సైకిల్ మళ్లీ బాలెన్స్ తప్పింది.

"వాడు జాకబ్, అట్లా చెయ్యకు. మంచివాడివి కదూ ఇవ్వాళ సాయంత్రం వాళ్ళంతా వస్తున్నారు. ఓ బంగారుపతకం గూడా యిస్తున్నారు. ఇది పూర్తయితే మనకు బోలెడు డబ్బు చూడు. ఎంతమంది నీకేసి చూస్తున్నారో!" అంటూ సింగు చాలాసేపు చెప్పాడు.

"ఎవరైనా కన్నుకుట్టి మంత్ర ప్రయోగమేదన్నా చేశారేమో నా కొడుకుమీద. ఈసారి వీడు తాయెత్తు కట్టుకోలేదు" అన్నాడు తండ్రి.

మరో గంటలో తాయెత్తు కట్టారు జాకబు భుజానికి.

"ఇంక ఫరవాలేదు. ఏ మంత్రమూ నీమీద పనిచెయ్యలేదు దిష్టికూడా తగలదు. హాయిగా తొక్కు" అన్నాడు తండ్రి.

చాలాసేపటిదాకా నిశ్శబ్దంగా తొక్కి,-

"సింగూ నువ్వేన్నన్నా చెప్పు ఇంక నేను తొక్కలేను, క్షమించు ఈసారికీ డబ్బు పోతేపోనీ మళ్లీసారి ప్రయత్నిద్దాం ఏమిటో, నా వొంట్లో బావుండ లేదు" అన్నాడు జాకబ్ నసుగుతూ.

సింగు కోపంతో పళ్ళు కొరికాడు.

మళ్లీ నిమ్మబద్దలు పిండారు కళ్ళలో.

జాకబ్ వద్దన్నాడు కాని ఎవరూవినిలేదు జాకబ్ బాగా తూలాడీసారి.

రాంలాల్ వచ్చి పట్టుకున్నాడు.

ప్రేక్షకుల్లో కలకలం మొదలైంది.

"ఏమిటి నీ వుద్దేశం?" అన్నాడు సింగు.

"నేను చెప్పానుగద తొక్కలేనని" అన్నాడు జాకబు తెగించి.

"మనం ఖర్చుపెట్టిన డబ్బంతా మట్టి గాలేనా, నీ మొహం తొక్కు, తొక్కు" అన్నాడు తండ్రి.

జాకబు తూలాడు.

ఇంక జాకబుకు అవకాశం యివ్వకుండా, తండ్రి, సింగూ చెరోవైపు హేండిల్ పట్టుకున్నారు.

"నడుపు."

జాకబ్ యివేవీ గమనించనట్టుగానే తొక్కాడు నెమ్మదిగా.

మధ్యాహ్నం ఎండ విపరీతంగావుంది. జాకబ్ తలమీద గుడ్డ కప్పారు. ఎండ దెబ్బ తగలకుండా. ఇంత ఎండనుకూడా లెక్కచేయక ప్రేక్షకులు వస్తూనేవున్నారు వాళ్ళని కంట్రోల్ చెయ్యటానికి పోలీసులు కూడా కావలసి వచ్చింది.

జాకబ్‌కు మూర్ఛవచ్చినట్లయింది.

ఓవైపునించి తండ్రీ, మరోవైపునించి సింగూ అతడికి నచ్చచెప్ప ప్రయత్నిస్తూనే వున్నారు

"నాకూ తొక్కాలనే వుంది. కాని తొక్కలేకపోతున్నాను. ఇవాళ వుదయం నించీ వొంట్లో బలహీనంగా వుంది. కళ్ళు మూసుకు పోతున్నాయి. తల తిరుగుతున్నది" అన్నాడు జాకబ్.

"అన్నీ దొంగవేషాలు తొక్కు" అన్నాడు సింగు.

జాకబ్ తొక్కాడు.

"పిడికిలి వదులవుతున్నది హేండిల్ పట్టుకోలేను" అన్నాడు జాకబ్.

"అదంతేలే తొక్కు" అన్నాడు తండ్రి.

మరిన్ని పసుపునీళ్ళు తెచ్చి, జాకబ్ చొక్కావిప్పి పారబోశారు.

ఆ గుడ్డలు విప్పి, కొత్త గుడ్డలు వేశారు.

ఓ టెంకాయ పగలేసి, ప్రసాదం పంచిపెట్టారు.

కాని జాకబ్ పరిస్థితి మారలేదు.

హేండిల్ వదిలేశాడు.

"అదేం కుదరదు. తొక్కాల్సిందే ఊ హేండిల్ పట్టుకో" అన్నాడు సింగు

జాకబ్ హేండిల్ పట్టుకోలేదు.

ఓ సన్న పేంబెత్తం తీసుకుని జాకబ్ వీపుమీద బాదారు మాట విన్నదాకా.

"అబ్బా!" అంటూ అరిచాడు జాకబ్.

"అదేమిటి. హింస!" అన్నారు ప్రేక్షకులు.

"ఇది మాకలవాటే కొద్దిసేపట్లో బాగవుతాడు చూడండి" అన్నాడు సింగు.

ఓ గ్లాసులో కారం కలిపిన నీళ్ళు తెచ్చారు, కళ్ళలో చిలకరించటానికి.

"నేను తొక్కలేను సింగూ, నన్నొదలెండి" అని మూలిగాడు జాకబ్.

"అరవకు అరిస్తే యింకా బాదుతాను" అన్నాడు సింగు.

జాకబ్ పిడికిలి వదులైనప్పుడల్లా బాదారు. సైకిల్ బాలెన్స్ తప్పినప్పుడల్లా కళ్ళలో కారంనీళ్ళు చిలకరించారు.

జాకబ్ భరించలేక కేకలేశాడు.

ఈ కేకలు వినిపించకుండా ప్రేక్షకుల చేత తారస్థాయిలో కేకలేయించారు,ఈలలు వేయించారు.

జాకబ్ మెళ్లో పూలదండలేశారు.

నేలమీద డబ్బు చల్లారు.

మళ్లీ మళ్లీ, టీ, పాలు, గ్లూకోజ్

యిచ్చారు.

"అదిగో, అదివచ్చింది" అన్నాడు సింగు రహస్యంగా.

జాకబు కన్నీటి పొరగుండా అ… కన్పించి మాయమైంది.

మళ్లీ హేండిల్ విడిచాడు.

వెంటనే చేతులమీద దెబ్బలుతగిలాయి.

కాని జాకబు పిడికిలి బిగించలేదు.

కళ్లల్లో నీళ్ళు చిలకరించారు.

కాని కళ్ళు తెరవలేదు జాకబు.

సింగు అందించిన పాలగ్లాసు నేలమీద పారేశాడు.

కోపంతో సింగు వీపుమీద బాదాడు.

జాకబు పసివాడిలా ఏడ్చాడు.

జనం గోలచేశారు.

"ఏమిటీ హింస, వొదిలెయ్యండి" అంటూ.

ఏం చెయ్యాలో ఎవరికీ అర్థంకాలేదు.

తండ్రి, జాకబు కాళ్ళు పట్టుకున్నాడు.

"నువ్వే రక్షించాలి జాకబు" అంటూ ప్రార్థించాడు.

"నేను తొక్కలేను నాన్నా, నేను తొక్కలేను సింగూ నన్ను క్షమించండి, ఈసారికి వొదిలెయ్యండి మీకు పుణ్యముంటుంది" అన్నాడు జాకబు జాలిగా.

సింగు కోపంతో బుసకొట్టాడు.

"ఒరేయ్ జాకబు, నా సంగతి నీకు తెలుసుగా! ఇప్పుడు గనక దిగావా నీ అంతు తేల్చేస్తాను" అన్నాడు.

జాకబు మాట్లాడలేదు.

వంటిమీద దెబ్బలవర్షం, కళ్లల్లోంచి నీళ్ళు కురిసినై.

జాకబు నిశ్శబ్దంగా కన్నీళ్ళు కార్చాడు.

తండ్రి, సింగు, మోసెస్, రాంలాల్ సైకిల్‌చుట్టూ మూగారు. ఊపిరి సలపనివ్వకుండా అరుస్తూ.

చెవులు బద్దలయ్యేట్టుగా జనం [illegible]. [illegible] రికార్డులు తలమాడిపోయే ఎండ, [illegible]లో మంట, దెబ్బల బాధ, నో[illegible]లు, [illegible] బూతులు, అవమానం, జ్ఞాపకాలు. బెంగ. తను దిగితే చంపుతానని బెదిరిస్తున్న సింగు!

బంగారు పతకం, రాత్రి వాళ్ళాడిన దొంగాటకు సాక్ష్యం చెప్పే తన కళ్ళు కాలిపోతున్నాయి.

అపస్మారకం కమ్ముకుంటున్నది. ఒంట్లో బాధ, నిస్పృహ—ఇంకా ఇంకా ఆ కళ్లలో కారం నీళ్ళు కావాలనే కోరిక. ఇంకా దెబ్బలు, తిట్లు కావాలి తనకు.

భరించలేకపోతున్నాడు.

తలమీద వేడి క్షణ క్షణానికీ పెరుగుతున్నది.

గోల తారస్థాయికి చేరుకుంటున్నది.

మెళ్లో పూలదండల బరువూ, తలమీది ఎండా పెరుగుతున్నవి.

చెమట వరదలు కట్టింది చక్కిలిగింతలు పెడుతూ.

తల పగిలిపోతున్నది. అవమానంతో, గోలతో తనమీద తనకే అసహ్యంగా వున్నది.

"సరే నాన్నా, సింగూ నేను తప్పకుండా తొక్కుతాను విడవండి."

దెబ్బలు, కారం, బూతులు, ఎండ, గోల.

నీ వేషాలు సాగవు ఇలా తొక్కు.

వేడి అసహనం, అసహ్యం.

"ఊఁ ఇలాతొక్కు పిడికిలి బిగించు."

వేడి, అసహనం తెగింపు.

పిడికిలి బిగించాడు, హేండిల్ మీద.

పెడల్ మీద కాలు సరిచూసుకున్నాడు.

తన శక్తినంతా కేంద్రీకరించి పెడల్ నొక్కాడు.

సైకిల్ కదిలింది—

ఇప్పుడు సైకిల్ వెనక తండ్రి, సింగు మోసెస్ పరిగెత్తుకొస్తున్నారు.

పిడికిలి యింకా బిగిసింది.

స్పృహ తప్పుతోంది. గుండె విపరీతంగా కొట్టుకుంటోంది.

నిర్వాహకులు పరిగెత్తుకొస్తున్నారు—కారంతో, కోపంతో, బెత్తంతో, బూతులతో నగ్నంగా. వేడిగా, అసహనంగా, గోల, చప్పట్లు కొడుతూ—జనం.

సైకిల్ టేబుళ్ల వేపు తిరిగింది.

తీగ నేలకు జారింది.

*

